క్లుప్తంగా

జేసీని కలిసిన కమిషనర్



జేసీ బి.నవ్యకు బొకే అందజేస్తున్న కమిషనర్

కర్నూలు(సెంట్రల్): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.నవ్యను సోమవారం కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో జేసీని కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను జేసీకి వివరించారు.

సెలవులో డీఆర్వో

కర్నూలు(సెంట్రల్): డీఆర్వో కె.మధుసూదన్ రావు సెలవులో వెళ్లారు. అనారోగ్య కారణాల రీత్యా ఆయన ఈనెల 24వ తేదీ వరకు సెలవు పెట్టారు. తిరిగి 26వ తేదీన విధులకు హాజరవుతారని తెలుస్తోంది. కాగా ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీఆర్వోగా అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవికి బాధ్యతలు అప్పగించారు.

రేపు ఉషూ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఈ నెల 21న జిల్లా స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ ఉషూ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టీ.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వరకు సబ్ జూనియర్ బాల బాలికలకు 18 సంవత్సరాల నుంచి 31 సంవత్సరాల వరకు సీనియర్స్ స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని, వివరాలకు 94400 47196 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రతి సమస్యను పరిష్కరించండి

కర్నూలు (టౌన్): 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ సూచించారు. సోమవారం స్థానిక నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై 14 మంది కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. మున్సిపల్ ఆరోగ్య శాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌ఓ జునీద్, ఏసీపీ మంజులత, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ప్రపంచానికి చిత్రమే దిక్సూచి

కర్నూలు(సెంట్రల్): ప్రపంచానికి చిత్రమే దిక్సూచీ అని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ అన్నారు. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాచార శాఖ కార్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవానికి కారణమైన లూయిస్ డాగురె చిత్రపటానికి జర్నలిస్టులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫొటోగ్రాఫర్లకు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమాచార కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



విధుల్లో చేరిన మధుసూదన్ గౌడ్

కర్నూలు: కర్నూలు నాల్గవ పట్టణ సీఐగా బి.మధుసూదన్ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడున్న శంకరయ్యను వీఆర్‌కు బదిలీ చేసి కర్నూలు సీఐడీ విభాగంలో ఉన్న మధుసూదన్ గౌడ్‌ను నాల్గవ పట్టణ సీఐగా నియమించడంతో సోమవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. కోవెలకుంట్ల మండలం అవుకు పట్టణానికి చెందిన ఈయన 1998లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. రాయలసీమ జిల్లాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఎస్‌ఐగా, సీఐగా విధులు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

కర్నూలు (టౌన్): దేవనకొండ మండలం ఎర్రచెరువు నుంచి అక్రమంగా ఎర్రమట్టి, నల్లమట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి రూ.30 వేలు, అలాగే సి. బెళగల్ మండలంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి రూ. 20 వేలు జరిమానా వసూలు చేశారు. అలాగే అనుమతులు లేకుండా మహారాష్ట్రకు తరలిస్తున్న నాపరాయి లారీని పట్టుకొని రూ. 35 వేలు జరిమానా వసూలు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ సోమవారం వెల్లడించారు.

ప్రముఖ కవి కాశీ భట్ల మృతి



కాశీభట్ల వేణుగోపాల్

కర్నూలు కల్చరల్: ప్రముఖ కవి కాశీభట్ల వేణుగోపాల్ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంగా ఉన్న ఆయన ఆదివారం రాత్రి కన్నుమూశారు. 1952లో కర్నూలులోని జన్మించిన ఆయన తన రచనల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. 1990లో ఆయన రాసిన నవల 'తపన' కు తానా వారు రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. నసర్గం, నిశబ్ద స్వరం, నేను చీకటి, లాంటి అనేక నవలలు, కవితలు రచన చేశారు. ఆయన మృతికి పద్మశ్రీ ఘంటసాల గాన కళాసమితి, తెలుగు భాషా వికాస ఉద్యమం, తెలుగు కళా సమితి, సాహితీ వేత్తలు సుస్వరం వాసుదేవ మూర్తి, డాక్టర్ పి.చంద్రశేఖర్, చంద్రశేఖర కల్కూర, ఎలమర్తి రమణయ్య, రాఘవేంద్ర ప్రసాద్, జేఎస్‌ఆర్కే వర్మ, జగన్నాథ గుప్త, కెంగార మోహన్, పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా, అజీజ్, వెంకట కృష్ణ, తదితరులు సంతాపం ప్రకటించారు.

నగరంలో జోరు వాన



జోరువానలో దూసుకెళుతున్న ఆటోలు



వినాయక ఘాట్ వద్ద కురుస్తున్న వర్షం



గొడుగు పట్టుకుని స్కూటీపై వెళుతున్న యువతులు

నగరంలో సోమవారం మధ్యాహ్నం జోరు వాన కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. గత కొద్ది రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సోమవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. కొందరు వర్షంలోనే తడుస్తూ ద్విచక్ర వాహనాల్లో ప్రయాణాలు కొనసాగించగా, మరికొందరు గొడుగులు అడ్డు పెట్టుకుని ముందుకుసాగారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కర్నూలులో 29.8 మి. మీ. వర్షం



చెరువును తలపిస్తున్న మల్లారెడ్డి అర్బన్ కౌంటీ

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో సోమవారం మధ్యాహ్నం వరకు ఎండలు, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉన్నట్టుండి సోమవారం మధ్యాహ్నం నుంచి కర్నూలుతో సహా వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. నగరంలో ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 29.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. మురుగునీటి కాల్వలు పొంగిపొర్లాయి. శివారుల్లో కొత్తగా వెలసిన వెంచర్లు చెరువులను తలపించాయి. నందికొట్కూరు రోడ్డులోని మల్లారెడ్డి అర్బన్ కౌంటీ చెరువులా మారింది. వర్షపు నీరు రహదారులను ముంచెత్తడంతో ప్రజలు బాధలు వర్ణణాతీతం. ఉరుముల తీవ్రత కూడ ఎక్కువగా ఉంది. అవుకు, బేతంచెర్ల మండలాల్లో పిడుగుపాటు సంఘటనలు చోటు చేసుకున్నాయి. అవుకు మండలంలో పిడుగుపాటుకు 32 జీవాలు మృతి చెందాయి. బేతంచెర్ల మండలం హెచ్.కొట్టాల గ్రామంలో పిడుగుపాటుకు ఒక వ్యక్తి మరణించాడు. అలాగే ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బ లక్షణాలతో మద్దికెరలో లక్ష్మిదేవి అనే మహిళ మృతి చెందారు.

బెంగాల్ సీఎం రాజీనామా చేయాలి



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కర్నూలు(సెంట్రల్): కోల్‌కతాలో విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నైతిక బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, ఐద్వా డిమాండ్ చేశాయి. సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కేవీఆర్ కాలేజీ నుంచి రాజ్‌విహార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల, జిల్లాకార్యదర్శి అలివేలు, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ నాయకులు భార్గవ్, అఖిల్ మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన దురదృష్టకరమన్నారు. ఈ ఘటనకు కారణమైన వారిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. హత్యాచారం ఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించడంలో ప్రిన్సిపాల్ ప్రమేయం ఉందన్నారు. ఆ మరుసటిరోజే ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయడం అనుమానాలకు మరింత తావిస్తోందని చెప్పారు. నిందితులను కాపాడడానికి ప్రయత్నించినట్లు అర్థమవుతోందని వివరించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిగే వరకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కర్నూలు (లీగల్): కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద న్యాయవాదులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అత్యాచారం చేసిన మానవ మృగాలను వెంటనే పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశా రు. మహిళా ప్రతినిధి సుమనారాణి, మహిళా న్యా యవాదులు నాగలక్ష్మిదేవి, ఉమాదేవి, యు.లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (సెంట్రల్): కలకత్తాలోని ఆర్‌జి కార్ ఆసుపత్రిలో పీజీ డాక్టర్ మౌమిత దేబనాథ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి శ్రావణి రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి మౌమిత ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అలాగే ఐద్వా ఆధ్వర్యంలో వీకర్ సెక్షన్ కాలనీలో మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

మహిళా చట్టాలను పటిష్టం చేయాలి



ఆర్‌యూలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేసి మహిళలకు మరింత భద్రత కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాయలసీమ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారంపై సోమవారం ఆర్‌యూ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలివాలని కోరారు. నాయకులు గణేష్, భరత్, అశోక్, అమర్, రాజు, రాజేష్, ప్రకాష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

దేశ సరిహద్దులో రక్షాబంధన్ వేడుకలు



బీఎస్‌ఎఫ్ జవాన్లతో కర్నూలు విద్యార్థులు

కర్నూలు కల్చరల్: రాజస్థాన్‌లోని భారత్ – పాకిస్తాన్ సరిహద్దులో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. సరిహద్దులోని బీఎస్‌ఎఫ్ 76 బెటాలియన్‌లో కర్నూలు టీజీవీ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భారత జవాన్లను ఎంతగానో ఆకట్టుకుంది. నృత్య శిక్షకుడు కె.వి.భార్గవ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయన శిష్య బృందం సరిహద్దులో వీర జవాన్లకు రాఖీలు కట్టిన అనంతరం నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. నృత్య శిక్షకుడు మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి సందర్భంగా దేశానికి నిత్యం కాపలా కాస్తున్న సైనికులలో ఆత్మవిశ్వాసం నింపేలా టీజీవీ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సంకల్పించిందన్నారు. విద్యార్థుల ప్రదర్శనపై సైనికులు, వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారన్నారు.

ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత





మాధవి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) మృతి చెందిన మాధవి

కర్నూలు(హాస్పిటల్): వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ ఎన్‌ఆర్ పేటలోని బాలాజీ హాస్పిటల్ వద్ద సోమవారం మృతురాలి బంధువులు ధర్నా నిర్వహించారు. తెలంగాణా రాష్ట్రం, అలంపూర్ నియోజకవర్గం తనగల గ్రామానికి చెందిన హెచ్.మాధవి (26)కి సర్వైకల్ స్పైన్ సర్జరీని ఆదివారం సదరు ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతో ఆపరేషన్ విఫలం కావడం వల్లే ఆమె మరణించిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. దీనికి తోడు మృతురాలికి సంబంధించి ఆసుపత్రి బిల్లు చెల్లించాలని యాజమాన్యం చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఆపరేషన్ నిర్లక్ష్యంగా చేసి ప్రాణాలు తీసిన మీకు తిరిగి డబ్బులు ఎందుకు చెల్లించాలంటూ మండిపడ్డారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓ స్పందించి హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆసుపత్రి మేనేజర్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

కర్నూలు సిటీ: స్థానిక మాధవీనగర్‌లోని సాయిసుబ్బయ్య రవీంద్ర ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో సోమవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య మాట్లాడుతూ.. కాలం మారినా, దూరం పెరిగినా చెరిగిపోని అనుబంధం, అన్నా చెల్లెలు, అక్కా, తమ్ముళ్ల బంధమని అన్నారు. అనంతరం స్కూల్‌లో బాలురకు బాలికలు రాఖీలు కట్టి రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలుశిక్ష

కర్నూలు (లీగల్): కర్నూలు త్రీటౌన్ పరిధిలోని అరోరా నగర్‌కు చెందిన యాదవ కళ్యాణిని వేధింపులకు గురిచేసిన భర్త యాదవ వేణుగోపాల్, మరో వ్యక్తి కురువ శేఖర్‌బాబుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.సరోజనమ్మ సోమవారం తీర్పు చెప్పారు. 2017లో కళ్యాణిపై అనుమానంతో ఆమె భర్త గోపాల్ మద్యం తాగి వచ్చి మానసికంగా, శారీరకంగా వేధించాడు. ఆమె భరించలేక అరోరా నగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఈ విషయం తెలుసుకుని భర్త, కురువ శేఖర్ అనే వ్యక్తి అరోరా నగర్‌కు వెళ్లి కళ్యాణి, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచారు. ఘటనపై కళ్యాణి ఫిర్యాదు మేరకు కర్నూలు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిపై చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో 6 నెలల జైలు శిక్ష, రూ.4 వేలు జరిమానా, 2వ నిందితుడికి 6 నెలల జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

చిరంజీవి అభిమానుల రక్తదానం

కర్నూలు(హాస్పిటల్): సినీనటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా అఖిల భారత చిరంజీవి యువత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్, డాక్టర్ కేజీ గోవిందరెడ్డి హాజరై రక్తదానం చేసిన అభిమానులను అభినందించారు.

ఇస్కాన్‌లో బలరామ పూర్ణిమ వేడుకలు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో సోమవారం బలరామ పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్రా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. తులసి హారతి, గౌర హారతి, మహా శంఖాభిషేకం, 56 రకాల ఆహార పదార్థాలతో మహా రాజభోగ నివేదన, మహా హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు

కర్నూలు (టౌన్): కర్నూలు నగర శివారులోని నందనపల్లెలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతువుల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పశువులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జంతువుల సంరక్షణ కేంద్రానికి తరలించాలని సూచించారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): డప్పు కళాకారులు అనారోగ్యంతో 50–60 ఏళ్ల మధ్యనే చనిపోతుండడంతో వారి కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక బీమా సదుపాయాన్ని కల్పించాలని ఏపీ డీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన డప్పు కళాకారుడు జె.చిన్నమద్దిలేటి అనారోగ్యంతో చనిపోవడంతో ఆయన మృతికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు మట్టి ఖర్చుల కోసం రూ.5వేలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..డప్పు కళాకారులు అనారోగ్యంతో త్వరగా చనిపోతున్న నేపథ్యంలో 45 ఏళ్లకే పెన్షన్ సదుపాయం కల్పిస్తే ఆసరాగా ఉంటుందన్నారు. అంతేకాక వారి కుటుంబాలకు బీమా కింద రూ.10 లక్షలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. నాయకులు చక్రపాణి, మాదన్న, నాగరాజు, జమ్మన్న, మద్దయ్య, వెంకటేశ్వర్లు, చిరంజీవి, నాగశేషులు, ప్రదీప్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి





మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్, ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో డీఐజీ

కర్నూలు: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సూచించారు. మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు సోమవారం మోటివేషన్ కార్యక్రమం జరిగింది. డీఐజీ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వివిధ రంగాల్లో సాంకేతికత, డేటా విశ్లేషణ, డేటా మైనింగ్, డేటా సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. పట్టుదల, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యం, కృషి ఉంటే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలను చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు అడిగిన సందేహాలను డీఐజీ నివృత్తి చేశారు. తాను ఎంబీబీఎస్ చేసిన తర్వాత సివిల్స్ ఎంచుకున్న విషయాన్ని వివరించారు. ట్రిపుల్ ఐటీ డీఎంలోని సదుపాయాలు, ల్యాబొరేటరీ సౌకర్యాలను డీఐజీ పరిశీలించారు. ట్రిపుల్ ఐటీ డీఎం కర్నూలు రిజిస్ట్రార్ గురుమూర్తి, డాక్టర్ సత్యబాబు, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.కిషోర్, ఎఫ్‌ఐసీ సెక్యూరిటీ, కర్నూలు తాలూకా సీఐ శ్రీధర్, బీటెక్, ఎంటెక్ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన జెడ్పీ చైర్మన్



గుజరాత్‌లో శిక్షణకు హాజరైన ఏపీ బృందం, చిత్రంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): గుజరాత్ రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన శిక్షణకు జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు మన రాష్ట్రం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ శ్రీలేఖ, కాకినాడ జిల్లా ప్రాతిపాడు ఎంపీపీ గొల్ల క్రాంతికుమార్, బాపట్ల డీఎల్‌డీఓ చంద్రసువార్త, ప్రకాశం బీడీఓ జీ.నితిన్, వైఎస్సార్ కడప ఎంపీడీఓ ఎస్.దివిజ పాల్గొన్నారు. ఈ శిక్షణ ఈ నెల 23వ తేదీ వరకు జరగనుంది. కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను గుజరాత్‌లోని ఐఆర్‌ఎంఏలో నిర్వహిస్తున్నారు. మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా సమర్థవంతమైన పంచాయతీ పాలన కోసం నాయకత్వ, నిర్వహణ నైపుణాలను అప్‌గ్రేడ్ చేసేందుకు ఈ శిక్షణా కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో గ్రూప్ చర్చలు, కేస్ స్టడీస్, ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్, ఇంటరాక్టివ్ ఉపన్యాసాలను నిర్వహిస్తున్నారు.

బేకరీలో చోరీ

కర్నూలు: స్థానిక మద్దూర్‌నగర్‌లోని కిరణ్ బేకరిలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. రాఖీ పండుగ కోసం పెద్దఎత్తున బేకరీ ఐటమ్స్‌తో పాటు కూల్‌డ్రింక్స్, ఖరీదైన చాక్లెట్లను దుకాణం యజమాని కిరణ్ నిల్వచేశారు. ఆదివారం రాత్రి వ్యాపారం ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు బేకరీ షట్టర్‌ను పెకిలించి క్యాబిన్‌కు ఉన్న అద్దాలను పగులగొట్టి లోపలికి దూరి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.10 వేలు నగదు, బేకరీ ఐటమ్స్, కూల్ డ్రింక్స్ మూటగట్టుకుని ఉడాయించారు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి దుకాణ యజమానికి సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకోగా దుకాణంలోని తినుబండారాలన్నీ చెల్లాచెదురుగా పడివున్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ క్రైం పార్టీ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. సీసీ ఫుటేజీని సేకరించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. పక్కనే ఉన్న బ్లూస్టార్ టైలర్ దుకాణం షట్టర్‌ను పెకిలించేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. బాధితుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

వరుస చోరీలతో బెంబేలెత్తిస్తున్న దొంగలు

రెండు నెలల వ్యవధిలో స్టేషన్ పరిధిలో దాదాపు 7 చైన్ స్నాచింగ్స్ జరిగాయి. రెవెన్యూ కాలనీలో లక్ష్మీదేవి, గణేష్‌నగర్‌కు చెందిన హేమసాయి, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీకి చెందిన రామలక్ష్మమ్మ, మాధవి నగర్‌కు చెందిన బిందు మాధవి, టెలికాం నగర్‌కు చెందిన వరలక్ష్మిల మెడలో ఉన్న పుస్తెల గొలుసును దొంగలు లాక్కెళ్లారు. వరుసగా ఇళ్లు, వ్యాపార దుకాణాలు, గొలుసు దొంగతనాలు జరుగుతున్నా నిఘా పటిష్టం చేయడం, ప్రత్యేక బృందాలను నియమించడం వంటి చర్యలు కొరవడ్డాయి. బ్లూ కోల్ట్స్, క్యూఆర్‌టీ సిబ్బంది రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు గస్తీ తిరగాలి. ఈ ప్రక్రియ సజావుగా జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. వరుస చోరీలతో దొంగలు పోలీసులకు సవాలు విసురుతున్నారు. స్టేషన్ పరిధిలోని శివారు కాలనీల్లో రాత్రి గస్తీ అంతంత మాత్రమేనని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గస్తీ సిబ్బందిపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే దొంగలు రెచ్చిపోతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

ఆటోలో ఎక్కించుకుని దోపిడీ

కర్నూలు: జిల్లా ఖజానా కార్యాలయం (ట్రెజరీ)లో పనిచేసి పదవీ విరమణ పొందిన జి.మద్దయ్య (70)కు చెందిన బంగారు నగలను ఆటోవాలాలు తస్కరించారు. ఆదివారం రాత్రి జిల్లా సరిహద్దులోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద మద్దయ్య ఆటో ఎక్కి కర్నూలుకు వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆటోడ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు యువకులు పథకం ప్రకారం మద్దయ్యను ఆటోలో ఎక్కించుకుని ఇరువైపులా కూర్చున్నారు. ఆయన్ను మాటల్లో పెట్టి దృష్టి మళ్లించారు. కొద్ది దూరం ప్రయాణించాక చేతిరుమాలును ముక్కు వద్ద పెట్టి స్పృహ తప్పి పడిపోయేలా చేసి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసు, ఉంగరం, పర్సులో ఉన్న రూ.300 నగదు, శ్యాంసంగ్ సెల్‌ఫోన్ తీసుకుని కర్నూలు కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న నిర్మల హోటల్ వద్ద ఆటో నుంచి కిందకు తోసేసి ఉడాయించారు. కొద్దిసేపు తర్వాత మద్దయ్య తేరుకున్నాడు. మెడలోని గొలుసు, చేతి ఉంగరం, సెల్‌ఫోన్, జేబులో ఉన్న పర్సు కనిపించలేదు. ఎలాగోలా ఇంటికి చేరుకుని కుమారుడి సాయంతో పోలీసులను ఆశ్రయించాడు. నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా టోల్ ప్లాజా తమ పరిధిలోకి రాదని చెప్పడంతో తాలూకా పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాల్సిందిగా కోరాడు.

– కొత్తబస్టాండ్‌ను అడ్డాగా చేసుకుని శరీన్‌నగర్‌కు చెందిన పాత నేరస్తులు ఇలాంటి తరహా చోరీలకు పాల్పడుతుంటారు. వారం రోజుల క్రితం ఇలాంటి నేరంలోనే ఓ పాత నేరస్తుడిని నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. మద్దయ్యకు సంబంధించిన నగలను కాజేసినవారు కూడా పాత నేరస్తులై ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో సోమవారం శ్రావణ పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. రాఖీ పౌర్ణమి దృష్ట్యా భక్తులకు రక్షా బంధన్ విశిష్టతను పండితులు వివరించారు. సూర్య నారాయణ స్వామి ఆలయంలో శ్రీ గౌరీ శంకర స్వామికి అభిషేకాలు, రమా సహిత సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. రాజరాజేశ్వరి దేవి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని శ్రీకృష్ణ మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, మామిళ్ల పల్లి రాజేష్ శర్మ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం శ్రీ రాజ శ్యామలా అమ్మవారి హోమం నిర్వహించారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
70750 09182
Office mail : sakshiknladvt@gmail.com